బాలలూ.. భానుడితో జాగ్రత్త

- ఎండల్లో ఆటలు వద్దు
- మిత ఆహారం తీసుకోండి
- తరచూ పండ్ల రసాలు, మజ్జిగ తాగండి



ఎండలో ఆడుతున్న బాలలు

ఆదోని అర్బన్: వేసవిలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 10 గంటలు దాటితే బయటకు వెళ్లలేని పరిస్థితి. వేసవిలో విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నారులను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచి, తేలిగ్గా అరిగేవాటిని, ద్రవ పదార్థాలను గానీ అందించాలి.

ఎండతీవ్రత పెరుగుతుండడంతో పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం పాఠశాలలకు జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో పిల్లలు ఆటల కోసం బయటకు తిరిగి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండేందుకు సాయంత్రం 5 గంటల తర్వాత బయటకు పంపాలని వైద్యులు సూచిస్తున్నారు.

- వేసవిలో బయట తిరిగితే కలిగే అనర్థాలు, సమస్యల గురించి తల్లిదండ్రులే పిల్లలకు అవగాహన కల్పించాలి. వేసవిలో చెమట అధికంగా పడుతుంది. దీనివల్ల శరీరంలో నీటిశాతం తగ్గిపోయి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- దాహం వేసినా, వేయకపోయినా గంటకోసారి మంచినీరు లేదా, గ్లూకోజ్ కలిపిన నీరు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం ఇవ్వాలి.
- వడదెబ్బ సోకితే గాలి, వెలుతురు తగిలే మెత్తటి కాటన్ దుప్పటిపై పడుకోబెట్టాలి. ఎటువంటి పరిస్థితుల్లో నీటిని తాపరాదు.
- శరీరం చల్లబడేలా నీటితో అద్దిన గుడ్డతో తుడవాలి. ప్రథమ చికిత్స అనంతరం ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- వేడి, ఉక్కపోత వల్ల చెమట పట్టి దద్దుర్లు వస్తాయి. వీటిని గోకడం వల్ల పుండ్లు ఏర్పడతాయి. మరికొన్ని చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటి బారిన పడకుండా రోజూ ఉదయం, సాయంత్రం స్నానం చేయించాలి.
- క్రిములు, శిలీంధ్రాలను అరికట్టే పౌడర్ రాయాలి. చర్మసంబంధ వ్యాధులు సంక్రమిస్తే వైద్యులను సంప్రదించాలి.
- వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా ఆడుకుంటూ ఉంటారు. దీంతో ఎక్కువగా నీళ్లు తాగేందుకు ఇష్టపడతారు. తీసుకునే ఆహారం తగ్గిపోతుంది. దీంతో శరీరానికి కావాల్సిన పోషక ఆహార విలువలు తగ్గిపోతాయి.
- ఈ లోటును నివారించేందుకు నీటితో పాటు పోషకాలు అందించాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి.
- వేసవిలో నూనె పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండడం మంచిది. పండ్లలో పుచ్చకాయ, కర్బూజ, బత్తాయి రసం ఇవ్వాలి.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



వేసవి వచ్చిందంటే పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మండుటెండల్లో బయటకు పంపరాదు. చన్నీటి స్నానం చేయించాలి. వదులుగా ఉన్న కాటన్ దుస్తులు వేయాలి. నీళ్లు, ద్రవ పదార్థాలను ఎక్కువగా అందించాలి. విటమిన్లు, ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న పదార్థాలను ద్రవ రూపంలో ఇస్తే మరీ మంచిది. ఇంట్లో తయారు చేసిన పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ఇవ్వాలి. రోడ్లపై దొరికే శీతల పానీయాలను, తినుబండారాలను కొనివ్వరాదు. దీనివల్ల ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ గోపీనాథ్, చిన్నపిల్లల వైద్యుడు

క్లుప్తంగా

రంగమ్మవ్వను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని ఖగ్గల్ గ్రామంలో వెలసిన రంగమ్మవ్వను మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అవ్వ సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేత మురళీమోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్ఐ

మంత్రాలయం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం మంత్రాలయంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలపై దృష్టి సారించి కొంత మేర రికవరీ చేశారు. కర్ణాటక మద్యం తరలించినా, అమ్మకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు.

తాగునీరు అందించండి

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా గ్రామాలకు తాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ హాల్వి ఎస్ఎస్ ట్యాంకు వల్ల మండలంలోని సుళేకేరి, మరళి, చూడి, కరణి, మదిర గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉన్నా.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక్క గ్రామానికి కూడా తాగునీరు అందించడం లేదన్నారు. ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రం కౌతాళంలో కూడా వారానికోసారి తాగునీరు సరఫరా అవుతుందని, వదులుతున్నారని అది కూడా ఫిల్టర్ చేయడం లేదని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని కోరారు.

వీధి లైట్ల ఏర్పాటు



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక మేజర్ పంచాయతీలో సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో బుధవారం వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి కాలనీలో వీధిలైట్లు ఏర్పాటుతో పాటు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటి పన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మంత్రాలయం: మండలంలోని మాలపల్లి సచివాలయం పరిధిలో గురువారం వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

30న కౌతాళంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం సమావేశం

ఆదోని అర్బన్: ఈనెల 30న ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని కౌతాళంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె శివన్న తెలిపారు. బుధవారం ఆదోనిలోని ఓ లాడ్జిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశంలో మంత్రాలయం నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్‌రావు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రాంతికుమార్‌తో పాటు మిగతా రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని, బీసీ కులాల నాయకులు పాల్గొనాలని కోరారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆదోని అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని పదో తరగతిలో అధిక మార్కులు తెచ్చుకున్న వాల్మీకి విద్యార్థులకు వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు బుధవారం తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు అత్యధిక మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులు హాల్ టికెట్, మార్కుల జాబితా(ఆన్‌లైన్‌లో తీసుకున్నది), కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులను 9640718346, 9491869398 నంబర్లకు వాట్సాప్ పంపాలన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఆదోని రూరల్: జిల్లాలోని కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడంతో కౌలు రైతులు ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలు, ఎరువులను పొందలేని పరిస్థితి నెలకొందన్నారు.

గుర్తింపు కార్డులతో ఎంతో మేలు

మంత్రాలయం: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ ఏఓ జీరాగణేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో కౌలు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు అంగీకారంతో కౌలు గుర్తింపు కార్డును పొందవచ్చని, దీని ద్వారా వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఎరువులు, విత్తనాలు సబ్సిడీ కింద కొనుగోలు చేయవచ్చన్నారు. రైతు భరోసాకు ఎంపికైన వారి వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామని, జాబితాలో పేర్లు లేని రైతులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నరసింహ, వీఏఏలు సువర్ణ, మధుకర్ ఉన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న

ఆదోని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం ఈనెల 22న కర్నూలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న ఉపాధి కూలీలను కోరారు. బుధవారం హానవాల్, మదిరె, దొడ్డనగేరి గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కోత పెట్టి ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తోందన్నారు. మస్టర్ విధానం పాత పద్ధతిలోనే కొనసాగించాలని, ఆన్‌లైన్ ద్వారా మస్టర్ రావడం వల్ల ఉపాధి కూలీలకు నష్టం జరుగుతుందని చెప్పారు. ఉపాధిలో రెండు పూటలా పనిని రద్దు చేయాలన్నారు. గునపం సాన పెట్టుకోవడానికి రూ.50, తాగునీటి కోసం ఒకరికి రూ.10, వేతనం రూ.600, 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. చేసిన పనికి 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 22న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు.

పనులు వేగవంతం చేయండి

కోసిగి: మండల కేంద్రంలోని భూగేని చెరువులో చేపడుతున్న తాగునీటి స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతం చేసి సురక్షిత మంచి నీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ రాముడు కోరారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో భూగేని చెరువులో జరుగుతున్న స్టోరేజీ ట్యాంక్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో మేజర్ పంచాయతీ కోసిగిలో పలు కాలనీల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం చేసే దిశగా స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వీరేష్, వెంకటేష్ ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కౌతాళం: సచివాలయ సేవల్ని విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుళేకేరి సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయంలో సేవల్ని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాల్య వివాహాల విషయంలో వలంటీర్లకు ముందుగానే తెలుస్తుందని, ఈ విషయాన్ని మండల అధికారులకు తెలియజేయాలని సూచించారు. అర్జీదారుల పనుల్ని ఏ రోజుకు ఆరోజు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలు, నాడు–నేడు పాఠశాలల పనులపై చర్చించారు. అధికారులు తమకు కేటాయించిన విధుల్ని సక్రమంగా పూర్తి చేయాలన్నారు. తన భూమిని చూపించాలని గ్రామానికి చెందిన హనుమేష్ కలెక్టర్‌కు పెట్టుకున్న అర్జీపై విచారణ చేశారు. ఆ భూమి అంతా గ్రామ దత్తం అని, సర్వే చేయలేమని ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదిక రూపంలో పంపుతామని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో మార్కెట్ యార్డుల అభివృద్ధి



ఆలూరు: జిల్లాలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల అభివృద్ధితో పాటు రూ.26కోట్లతో లింక్ రోడ్ల పనులు కొనసాగుతున్నాయని జిల్లా మార్కెటింగ్ అగ్రిటెక్ అధికారి ఏ.నారాయణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, మార్కెట్ యార్డులలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు డిగాడిగేటర్స్ ద్వారా కొనసాగుతున్నాయన్నారు. పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం మార్కెట్ యార్డులలో క్రయవిక్రయాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎంపీ ఎఫ్‌సీ ద్వారా 95 గోదాములు 500 వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నామని, ఇప్పటివరకు 65 మంజూరు కాగా 16 పూర్తయినట్లు మార్కెట్ అధికారి నారాయణమూర్తి తెలిపారు. అనంతరం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ.. రైతులు పండించిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డీడీఏ నారాయణమూర్తిని కోరారు. యార్డు కార్యదర్శి శాంతకుమార్, కమిటీ సిబ్బంది తదితరులు ఉన్నారు. అలాగే ఈనెల 28న యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్యకర్తలు, డైరెక్టర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

వికలాంగుల సమస్యలపై పోరాడుదాం

కోసిగి: వికలాంగుల సమస్యలపై పోరాడి పరిష్కరించుకుందామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం భీమయ్య, మంత్రాలయం తాలూకా ఇన్‌చార్జ్ సంగటి యోహాన్ మాదిగలు కోరారు. బుధవారం కోసిగిలో వికలాంగుల సంఘం నాయకుడు రాజేష్‌తో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ వికలాంగులకు నెలకు ఇచ్చే రూ. 3 వేల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, మంత్రాలయం మండల నాయకులు గర్జి ప్రకాష్, డీలర్ రాజు, కోసిగి నాయకులు రాంబాబు, ఎర్రన్న పాల్గొన్నారు.

ఇండియాకు రప్పించండి

– ఇండియా ఎంబసీని వేడుకుంటున్న ఆదోనివాసి



మహ్మద్‌ఇమ్రాన్

ఆదోని అర్బన్: ఏజెంట్ చేతిలో మోసపోయి దుబాయిలో బందీగా ఉన్నానని, తనను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన మహ్మద్‌ఇమ్రాన్ భారత ఎంబసీని కోరుతున్నాడు. కర్ణాటకకు చెందిన ఏజెంట్ సయ్యద్ షట్‌డౌన్ వర్క్ ఉందని, నెలన్నరకు రూ.2 లక్షలు ఇస్తారని నమ్మించి తనను మార్చి 30న దుబాయికి పంపించాడని, ఇక్కడ ఏ పనీ లేకపోవడంతో పాటు పాస్‌పోర్టు లాక్కొని బంధించారని ఎలాగైనా ఇండియాకు చేరుకునేలా చూడాలని వేడుకుంటున్న వీడియో ఫేస్‌బుక్, వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తోంది. తన పేరు మీద బ్యాంకులో క్రెడిట్‌లోను తీసుకుంటామని, అందులో నుంచి చెప్పిన అమౌంట్ ఇచ్చి పంపుతామని చెబుతున్నారని, తనకు ఏ అమౌంట్ అక్కరలేదని, పాస్‌పోర్టు ఇస్తే ఇండియా వెళ్తానని వేడుకున్నా కనికరించకుండా బెదిరిస్తున్నారని వీడియోలో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ప్రయాణికుల ఆందోళన

హొళగుంద: ఆదోని ఆర్టీసీ బస్సులు రూటు మార్చడం పట్ల బుధవారం రాత్రి హెబ్బటంకు వెళ్లాల్సిన ప్రయాణికులు హొళగుంద బస్టాండులో బస్సు ముందుకెళ్లకుండా ఆందోళనకు దిగారు. దాదాపు 25 మంది ప్రయాణికులు రాత్రి హెబ్బటం వెళ్లేందుకు హొళగుంద బస్టాండుకు చేరుకున్నారు. బస్సు హెబ్బటం మీదుగా వెళ్లదని, ఎల్లార్తి మీదుగా వెళ్తుందని డ్రైవర్, కండెక్టర్ చెప్పడంతో అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. దీనిపై ఆర్టీసీ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. హెబ్బటం మార్గంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఉన్నతధికారులు ఆదేశాల మేరకు ఎల్లార్తి మీదుగా బస్సులు నడుపుతున్నట్లు తెలి పారు. ప్రయాణికులు సమస్యను మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు హెబ్బటం మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. గురువారం నుంచి బస్సు హొళగుంద – ధణాపురం మార్గంలోనే తిరిగేలా మంత్రి చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశా విలేకరులకు తెలిపారు.

యువతి ఆత్మహత్య



కావేరి మృతదేహం

గుంతకల్లు రూరల్: జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఆంజనేయులు కుమార్తె కావేరి (21)కి కొంత కాలం క్రితం గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కొంత కాలం క్రితం గుంతకల్లులోని మిల్లు కాలనీలో ఉంటున్న తన చిన్నాన్న బసప్ప ఇంటికి వచ్చిన ఆమె.. బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

జగనన్న విద్యాకానుకలు సిద్ధం



విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్

పత్తికొండటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి పంపిణీ చేసేందుకు అవసరమైన జగనన్న విద్యాకానుకలు ఆయా మండల కేంద్రాలకు చేరినట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు. బుధవారం పత్తికొండలో ఎంఆర్‌సీ భవనంలో భద్రపరచిన విద్యాకానుక కిట్లలోని వస్తువులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,92,955 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు విద్యాకానుకలు ఆయా మండల స్టాకు పాయింట్లకు చేరాయన్నారు. జూన్ 1వ తేదీలోగా కిట్లను మండల కేంద్రాలకు చేర్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. అక్కడనుంచి జూన్ 11వతేదీలోగా ఆయా పాఠశాలలకు తీసుకెళ్లాలని, బడి తెరిచిన రోజునే విద్యార్థులకు పంపిణీ చేసేలా ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, డిప్యూటీ ఈఓ సుకుమార్, ఎంఈఓ మస్తాన్‌వలి, సీఆర్‌పీ తులసిరెడ్డి వెంట ఉన్నారు.

పగిలిన బండరాయి పరిశీలన



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీలో నరసప్ప దేవాలయం వద్ద ఎండ వేడిమికి పగిలిన భారీ కొండ రాయిని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా మేనేజర్ అనుపమ, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. ఎండ వేడిమికి ఏప్రిల్ 9న భారీ కొండరాయి రెండుగా చీలిన సంగతి తెలిసిందే. చీలిక అప్పటికీ ఇప్పటికీ ఏమైనా తేడా ఉందా అని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కాలనీ వాసులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం కొండను పరిశీలించి మేజర్‌మెంట్ తీసుకున్నట్లు తెలిపారు. బండరాయికి ఒక వైపు ఇనుప కడ్డీలు ఏర్పాటు చేసి మరో వైపు నుంచి తొలగిస్తామని తెలిపారు. పరిశీలన నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన చెప్పారు. కలెక్టర్ ఉత్తర్వులతో తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, మైనింగ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

19న వాహనాల వేలం

ఆలూరు రూరల్: ఆలూరు సెబ్ పరిధిలోని 5 మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకటే బుధవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నంద్యాల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఆలూరులోని సెబ్ స్టేషన్ ఆవరణంలో వాహనాల వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5 వేల నగదు చలానా చెల్లించి వేలాల్లో పాల్గొన్నవచ్చని సెబ్ సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గోనెగండ్ల: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓతో పాటు ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు ఖాద్రీ హాజరై మాట్లాడారు. విత్తన డీలర్లు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. బిల్ బుక్కులు, విత్తన రకం, కంపెనీకి సంబంధించి సోర్స్ ఆఫ్ సప్లై ఫైల్ మెయింటెయిన్ చేయాలన్నారు. ప్రతి బిల్లును మండల ఏఓతో సర్టిఫై చేసుకోవాలని సూచించారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని, నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఓ రాజాకిషోర్, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఆలూరు సీఐగా వెంకటేశ్వర్లు

ఆలూరు: స్థానిక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వెంకటేశ్వర్లును నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులను జారీచేశారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ ఆర్.ఈశ్వరయ్యను గత నెలలో వివిధ కారణాలతో వీఆర్‌కు పంపారు.ఆ స్థానంలో ప్రస్తుతం సీఐ బి.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నేడు డీఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం



నూతన డీఎస్పీ కార్యాలయం

ఎమ్మిగనూరురూరల్: సబ్–డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రారంభించనున్నారు. సబ్ డివిజన్ కార్యాలయంతో మొదటిసారిగా ఎమ్మిగనూరుకు డీఎస్పీ పోస్టు వచ్చింది. ఆదోని రోడ్డు టీబీపీ కార్యాలయం సమీపంలో నూతన డీఎస్పీ కార్యాలయంను సిద్ధం చేశారు. ఈనెల 3వ తేదీన డీఎస్పీగా బి.సీతారామయ్య బాధ్యతలు చేపట్టారు. నూతన భవనం ప్రారంభిస్తే పూర్తి సేవలను కార్యాలయం నుంచే డీఎస్పీ అందించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, డీఎస్పీ బి.సీతారామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సబ్–డివిజన్ పోలీస్ అధికారులు హాజరుకానున్నట్లు టౌన్ సీఐ మధుసుధన్‌రావు బుధవారం సాయంత్రం తెలిపారు.

27 నుంచి రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 27, 28 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో 8 వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, పురుషుల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ కేటగిరిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వచ్చే నెల 17,18 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ముగ్గురు వైద్యులకు పదోన్నతులు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ముగ్గురు గైనకాలజిస్టులకు పదోన్నతి లభించింది. ఆయా కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారికి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు అనంతపురంలో పనిచేస్తున్న డాక్టర్ పద్మజ, నంద్యాలలో మెడికల్ కాలేజీలో పని చేస్తున్న డాక్టర్ స్నిగ్ధ కర్నూలుకు బదిలీ అయ్యారు. కర్నూలులోనే విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సావిత్రి పదోన్నతిపై ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు.

ప్రజా పంపిణీకి పెద్దపీట

- పేదలకు బియ్యంతో జొన్నల పంపిణీ
- నియోజకవర్గంలో 78,083 మందికి లబ్ధి



కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి (ఫైల్)

ఆదోని రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.2కే కిలో బియ్యం పంపిణీ చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల వద్దకే సరుకులు చేరవేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా మన్ననలు పొందుతున్నారు.

ఇంటి వద్దకే రేషన్..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీకి జగనన్న చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ట్రక్కులను ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించి సరుకులను నియోజకవర్గంలోని 78,083 మంది లబ్ధిదారుల ఇళ్లకు చేరవేస్తోంది. ఫలితంగా గత ప్రభుత్వంలోలాగా నిత్యావసర సరుకుల కోసం రేషన్‌షాపుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తప్పిందని కార్డుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్డుదారులకు జొన్నలు

రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం కార్డుదారులకు కేజీ జొన్నలను అందిస్తోంది. ఈ నెల నుంచే జొన్నల పంపిణీకి శ్రీకారం చుట్టింది. త్వరలో రాగులను కూడా అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గంటల తరబడి నిలబడేవాళ్లం



గతంలో రేషన్ బియ్యం కోసం డీలర్ షాపుల వద్ద గంటలతరబడి పనులు వదులుకుని వేచి ఉండేవాళ్లం. బయోమెట్రిక్ సరిగా పడకపోతే మరో రోజు రేషన్‌షాపు వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జగనన్న పుణ్యమా అంటూ ఇంటి వద్దకే రేషన్ సరుకులు వస్తున్నాయి.

– ముక్కరమ్మ, పెద్దతుంబళం గ్రామం

ప్రతికార్డుదారుడికీ రేషన్ సరుకులు



ప్రతి కార్డుదారుడికి రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు చేపట్టాం. కార్డుదారుల ఇంటి వద్దకే ట్రక్కు వెళ్లి సరుకులు అందజేస్తుంది. ఇటీవల కిలో రేషన్‌కు బదులు కిలో జొన్నలు అందిస్తున్నాం. త్వరలో రాగులను కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

–వెంకటలక్ష్మి, ఆదోని తహసీల్దార్